హన్సిని టుడే
http://www.todaytelugudaily.com | తెలుగు దినపత్రిక

మాఘం, శుక్లపక్షం
అష్టమి
సూర్యోదయం 06:49
సూర్యాస్తమయం 06:08
ఉష్ణోగ్రతలు
గరిష్టం 29.0 | కనిష్టం 18.0

# రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారానికి కోడుమూరి ప్రవీణ్ ఎంపిక



**కోదాడ (జనవరి 25) టుడే ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,500 మీసేవా కేంద్రాల్లో అత్యుత్తమంగా, అత్యధిక సేవలను అందించిన నిర్వాహకుడిగా సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన పద్మావతి మీసేవా కేంద్రం నిర్వాహకుడు కోడుమూరి ప్రవీణ్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) అధికారులు శనివారం అధికారికంగా ప్రకటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఈఎస్‌డీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ప్రవీణ్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో ప్రవీణ్ చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సేవనే లక్ష్యంగా తీసుకుని, ప్రభుత్వ సేవలను సామాన్యులకు సులభంగా చేరవేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక సేవలను అందించిన మీసేవా కేంద్రంగా పద్మావతి మీసేవా కేంద్రం నిలిచిందని పేర్కొన్నారు. ప్రవీణ్‌ను ఇతర మీసేవా కేంద్రాల నిర్వాహకులు ఆదర్శంగా తీసుకోవాలని ఈఎస్‌డీ అధికారులు సూచించారు. ప్రవీణ్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడంపై మీసేవా ఆపరేటర్ల సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు మండవ వీరబాబు, గొట్టిపాటి శ్రీకాంత్, కుక్కడపు గురవయ్య, రాజు, యర్రబాతి ప్రసాద్, బుర్రా శంకర్, గంధం రాము, ఇతర మీసేవా ఆపరేటర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

తెలంగాణ | సంపుటి : 10 సంచిక : 26 | సోమవారం 26 జనవరి 2026 | ఎడిటర్ : బాదె రామారావు | పేజీలు : 4 వెల : 1/-

# గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

## పద్మ పురస్కారాలకు ఎంపికైన వారికి అభినందనలు : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారత దేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షించారు. అందుకు ఆధారమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీ దేశ ప్రజలందరికీ పండుగ వంటిదని పేర్కొన్నారు. జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సోమవారం నాడు రిపబ్లిక్ డే సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సహా ఢిల్లీలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

పద్మ పురస్కారాలకు ఎంపికైన వారికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పద్మశ్రీ వరించిన 11 మంది తెలుగువారికీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడుకి పద్మ భూషణ్ వరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

తరువాయి 2లో..

# బీఆర్‌ఎస్ ఓ పెద్ద జోక్ వేసింది

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** ఏబీఎన్–ఆంధ్రజ్యోతి ఛానెల్‌ను నిషేధిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించడం పెద్ద జోక్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎన్నడో నిషేధించారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అడుగులకు మడుగులొత్తే అనుకూల మీడియా మాదిరిగానే ఇతర మీడియా ఉండాలనుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. బీఆర్ఎస్ అనుకూల మీడియాలో మాట్లాడినట్లుగానే... ఇతర మీడియాలో మాట్లాడతానంటే ఎలా? అని ప్రశ్నించారు కేంద్రమంత్రి. ఏబీఎన్ టీవీ చర్చలో హద్దు దాటిందెవరు..? సరిదిద్దాలని అనుకుందెవరు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అభ్యంతరకరంగా బీఆర్ఎస్ నేత దూషించడం తప్పు కాదా? అని నిలదీశారు. ఆ పదాన్ని వెనక్కు తీసుకోవాలని ఏబీఎన్– ఆంధ్రజ్యోతి కోరినా వినకుండా.. మూర్ఖంగా వ్యవహరించడం హుందాతనం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

**అడ్డగోలుగా మాట్లాడుతారా..**

ఇష్టమొచ్చినట్లు అడ్డగోలుగా మాట్లాడటం

తరువాయి 2లో..

# మూడో ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా భారత్

## జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి గణతంత్ర ప్రసంగం



భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశానికి మూలస్తంభమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలకు ఘనంగా నివాళులర్పించారు.

**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశానికి మూలస్తంభమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రేపు(సోమవారం) జనవరి 26 సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలకు ఘనంగా నివాళులర్పించారు రాష్ట్రపతి. దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ హోదా, గతం, వర్తమానం, భవిష్యత్తులో దేశ దిశానిర్దేశాన్ని చాటిచెప్పే అమూల్యమైన సందర్భం ఇదని రాష్ట్రపతి అన్నారు. ప్రపంచంలో పలుచోట్ల అనిశ్చిత పరిస్థితి ఉన్నప్పటికీ భారతదేశం త్వరలోనే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలువనుందని చెప్పారు. సోమవారం నాడు దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో రాష్ట్రపతి ఆదివారం నాడు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

భారతదేశ ప్రజాస్వామ్య జర్నీని వివరిస్తూ, భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశానికి మూలస్తంభమని, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలు భారత రాజ్యాంగంలో పొందుపరిచి ఉన్నాయని అన్నారు. రాజ్యాంగ నిబంధనల ద్వారా పటిష్టమైన జాతీయ స్ఫూర్తిని, దేశ సమైక్యతను రాజ్యాంగ నిర్మాతలు పాదుకొలిపారని చెప్పారు. బలమైన స్వాతంత్రోద్యమంతో 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం వచ్చిందని, స్వతంత్ర దేశ పౌరులుగా మన భవిష్యత్తును మనమే నిర్దేశించుకునే హక్కు పొందామని, 1950 జనవరి 26 నుంచి మన గణతంత్ర దేశాన్ని రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన దిశగా ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు.

నారీశక్తి ప్రాధాన్యతను ద్రౌపది ముర్ము ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. వికసిత్ భారత్ నిర్మాణంలో నారీశక్తి కీలకమని అన్నారు. సంప్రదాయ స్టీరియోటైప్‌ను బ్రేక్ చేస్తూ మహిళలు ముందుకు దూసుకెళ్తున్నారని, దేశాభివృద్ధిలో చురుకుగా పాల్గొంటున్నారని ప్రశంసించారు. వ్యవసాయ రంగం నుంచి అంతరిక్షం వరకూ, స్వయం ఉపాధి నుంచి సాయుధ బలగాల వరకూ మహిళలు ప్రతిరంగంలోనూ తమదైన బలమైన ముద్రను చాటుతున్నారని అన్నారు. గత ఏడాది నవంబర్‌లో ఐసీసీ మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌ను, బ్లయిండ్ ఉమన్ టీ–20 వరల్డ్ కప్‌ను మన ఆడకూతుళ్లు సొంతం చేసుకున్నారని అన్నారు. గత ఏడాది చెస్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇద్దరు భారతీయ మహిళల మధ్య జరిగిందని గుర్తు చేశారు.

**తిరుగులేని ఆర్థిక శక్తిగా..**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వంపై రాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య అంతరాన్ని తగ్గించగలిగిందని అన్నారు. ప్రపంచంలో పలుచోట్ల అనిశ్చిత పరిస్థితి ఉన్నప్పటికీ భారతదేశం త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా నిలువనుందని చెప్పారు. జీఎస్‌టీ అమలు, ఒన్ నేషన్–వన్ మార్కెట్ వంటి నిర్ణయాలను ప్రశంసించారు. ఇటీవల తీసుకున్న నిర్ణయాలతో జీఎస్‌టీ సిస్టమ్ మరింత సమర్థవంతంగా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయగలిగిందన్నారు.

'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం సాధించిన విజయాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రశంసించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలను వ్యూహాత్మకంగా సైన్యం ధ్వంసం చేసిందని, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత (స్వయం సమృద్ధిని)కు ఆపరేషన్ సిందూర్ నిదర్శనమని కొనియాడారు.

## 100 స్పీడుతో ఎస్ఐని ఢీ కొట్టిన కారు



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. అతి వేగంగా వచ్చిన కారు విధుల్లో ఉన్న ఓ ఎస్ఐని ఢీకొట్టింది. ఎస్ఐ బానెట్‌పై ఉండగానే కారు కొన్ని మీటర్ల వరకు దూసుకెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ మధు డ్రంక్ అండ్ డ్రైవ్ తనఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ కారు 100 స్పీడుతో

## తెలంగాణలో పోలీసు అధికారుల బదిలీలు

**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** తెలంగాణ పోలీసు శాఖలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఏసీపీ, డీఎస్పీలను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, పరిపాలనా సౌలభ్యం కోసం పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు పలు జిల్లాల అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది.

తరువాయి 2లో..

# మహేశ్‌గౌడ్ జాగృతి పార్టీలో చేరండి : పార్టీ అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశా రు. మహేశ్ కుమార్ గౌడ్‌ను జాగృతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జాగృతిలో చేరితే ఆయన కు మంచి పోస్ట్ ఇస్తానంటూ ఆఫర్ చేశారు. ఆదివా రం నాడు హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత మాట్లాడారు.

**కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ..**

తనను కాంగ్రెస్‌లో చేర్చుకోమని టీపీసీసీ అధ్యక్షుడు అంటున్నారని కవిత అన్నారు. అసలు తానెందుకు కాంగ్రెస్‌లో చేరతాను..? అంటూ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జాగృతి గెలువబోతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తనను బద్నాం చేసే పనిలో మహేశ్ గౌడ్ ఉన్నారని ఆరోపించారు. తాను కాంగ్రెస్‌లో చేరతానని మహేశ్ కుమార్ గౌడ్‌కు

తరువాయి 2లో..

# నేడు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల నిరసన



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** గిగ్, ప్లాట్ ఫామ్ రంగాల్లో కార్మికులపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా జనవరి 26న దేశవ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ (GIPSWU) ప్రకటించింది. గిగ్ వర్కర్లను అధికారికంగా కార్మికులుగా గుర్తించడంతోపాటు సెంట్రల్ గిగ్ చట్టం తీసుకురావాలన్న డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ నిరసనలో భాగంగా రైడ్ హైలింగ్, ఆహార, కిరాణ వస్తువుల డెలివరీ, గృహ సేవలు, బ్యూటీ--వెల్‌నెస్, లాజిస్టిక్స్, ఈ–కామర్స్, డిజిటల్ సేవల రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ యాప్‌లను పూర్తిగా ఆఫ్ చేసి నిరసన తెలపాలని యూనియన్ పిలుపునిచ్చింది. తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం

తరువాయి 2లో..

## సింగరేణి స్కాంలో

# రేవంత్‌రెడ్డినే లబ్ధిదారుడు: హరీశ్‌రావు



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి స్కాంలో రేవంత్‌రెడ్డినే లబ్ధిదారుడని షాకింగ్ కామెంట్స్ చేశారు. స్కాంలు, కాంగ్రెస్ అరాచకాలతో సింగరేణి సంస్థపై భారం పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో స్కీంలు లేవు.. కానీ స్కాంలు పెరిగిపోయాయని ఆరోపణలు చేశారు. జాబ్ క్యాలెండర్ కాదని.. రేవంత్‌రెడ్డి స్కాంల క్యాలెండర్‌ను తెచ్చారని ఆక్షేపించారు. ఆంధ్రా నేతలతో రేవంత్‌రెడ్డి చేతులు కలిపి.. నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

**ఆ స్కాంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి..**

కాంగ్రెస్‌లో అత్యుత్తమ హోదా పొందటానికి అందరికంటే ఎక్కువ అర్హత ఉన్న నాయకుడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కనేనని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. అంతటి అనుభవం ఉన్న భట్టి విక్రమార్క.. రేవంత్‌రెడ్డి కళ్లల్లో ఆనందం కోసం పనిచేయటం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణి స్కాంపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భట్టి లబ్ధిదారుడా లేదా అనేది విచారణలో తేలుతుందని తెలిపారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు గతంలో మంత్రులు రాజీనామా చేసేవారని ప్రస్తావించారు. సింగరేణి ఓబీ వర్క్స్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తెచ్చిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. తనకు లేఖ రాస్తే.. ముఖ్యమంత్రితో మాట్లాడుతానని భట్టి అనటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రేపో, మాపో తమకు మరో ప్రేమ లేఖ(సిట్ నోటీసు) వస్తుందని సెటైర్లు గుప్పించారు.

**టెండర్లను రద్దు చేయాలి..**

మే 2025లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీ వర్క్స్ కోసం సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తీసుకొచ్చిందని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఓబీ వర్క్స్‌లో మొదటి లబ్ధిదారుడు ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డినేనని ఆరోపణలు చేశారు. నైనీ బ్లాక్ టెండర్లు కాదని.. సైట్ విజిట్ సర్టిఫికెట్ మీద జరిగిన అన్ని టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2025 మే నుంచి ఎంతమందికి సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిని బొగ్గు స్కాం నుంచి బయట పడేయటానికి ప్రయత్నం చేసి భట్టివిక్రమార్క విఫలమయ్యారని విమర్శించారు. భట్టి మాటల గారడితో మసిపూడి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. సింగరేణి స్కాంలో లబ్ధిదారులు ఎవరు..? నష్టం ఎంత..? ఎవరు బాధ్యులో.. భట్టివిక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**భట్టి రక్షిస్తున్నారు..**

సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది బాగోతం బయటపడకుండా.. భట్టి రక్షిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ నేతల స్వార్థం కోసం వారికి అనుకూలంగా సింగరేణి విధానాలను మార్చారని ఆక్షేపించారు. 2018లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ ఉందని భట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. భారతదేశంలో ఓబీ వర్క్స్ సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానమే లేదని స్పష్టం చేశారు. 2018 నుంచి 2024 వరకు అనేక ఓబీ వర్క్స్‌కు టెండర్లు జరిగాయని... వాటికి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం లేదని ప్రస్తావించారు. సైట్

తరువాయి 2లో..

అక్కడ గుడి ఉండదు... విగ్రహాలు కనిపించవు... వేద మంత్రాలు వినిపించవు... హోమాలు, యాగాల సందడే ఉండదు.. అయినా లక్షలాది మంది భక్తుల శరణు ఘోషతో జంపన్నవాగు శిగమూగుతుంది. వన దేవతల రాక కోసం లక్షల కళ్లు నిరీక్షిస్తాయి. అడవి నుంచి తల్లులను తీసుకొచ్చే గిరిజన పూజారుల కాళ్లు తాకేందుకు పొర్లు దండాలు పోటెత్తుతాయి. ఎదురుకోళ్లు గాలిలోకి ఎగురుతాయి. ప్రకృతి దేవతల కొలువైన 'మేడారం' ఈసారి సరికొత్త రూపు సంతరించుకుంది. ఆదివాసీ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలా కనిపించే... తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరలోకి ఓసారి వెళ్లొద్దాం...

# మేడారం వెళ్లొద్దాం!



**హైదరాబాద్, టుడే ప్రతినిధి :** ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర, 'తెలంగాణ కుంభమేళ'గా పిలిచే మేడారం మహాజాతర జోరు అనధికారికంగా నెల రోజుల ముందే మొదలయ్యింది. ఈసారి జాతర అందరికీ సరికొత్తగా కనిపించనుంది. రాబోయే 200 ఏళ్లు చెక్కు చెదరకుండా గ్రానైట్‌పై ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర తెలిసేలా శిల్పాకళా సంపదతో మేడారం గద్దెలు, ప్రాంగణం ముస్తాబయ్యింది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, ఎత్తయిన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. పాలరాతి శిలలతో గద్దెలు, జంపన్నవాగు సుందరీకరణ, నాలుగు లైన్ల రోడ్ల విస్తరణ, క్యూలైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ... అభివృద్ధి నిధులతో మేడారం రూపురేఖలే మారిపోయాయి.

**స్తంభాలపై సంస్కృతిని చెక్కారు...**

'మేడారం'లో ఒకప్పుడు ఇరుకుగా ఉండే ప్రాకారం ఇప్పుడు భారీగా విస్తరించారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఒకవైపు... పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు దక్షిణం వైపు ఉండేవి. ప్రస్తుతం ఒకే వరుసలో సమ్మక్క, సారలమ్మ గద్దెలతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను కూడా నిర్మించారు. గద్దెలు ఒకే వరుసలో రావటంతో వన దేవతలకు మొక్కులు చెల్లించుకునే భక్తులు లోపలికి రావడానికి నాలుగు ద్వారాలు... మొక్కుల అనంతరం బయటకు వెళ్లేలా నాలుగు ద్వారాలు ఏర్పాటు చేశారు. అంటే... అష్టదిక్కుల్లో అష్ట ద్వారాలను ఏర్పాటు చేశారు.

గద్దెల చుట్టూ నిర్మించిన 32 గ్రానైట్ స్తంభాలపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను చెక్కారు. 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించిన 7 వేలకు పైగా శిల్పాలను ఏర్పాటు చేశారు. 930 ఏళ్ల కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్పాలకు రూపకల్పన చేశారు. గద్దెల ముందు తెల్లని గ్రానైట్ స్తంభాలతో చిలుకలగుట్టకు వెళ్లే దారిలో తూర్పు దిశగా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం ఆకర్షణీయంగా ఉంది. ఈ స్వాగత తోరణ శిలలపై సమ్మక్క–సారలమ్మ పూర్వీకులతో పాటు, కోయల జీవనశైలి తెలిసేలా బొమ్మలు చెక్కారు. తెలుపు రంగు రాళ్లను ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు తరలించారు. అక్కడి శిల్పులతో చెక్కించాక మేడారానికి తీసుకొచ్చారు. ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నె లల తరబడి రేయింబవళ్లు శ్రమించి, మేడారం చరిత్రకు కొత్త రూపునిచ్చారు.

**గద్దెల చుట్టూ 8 రాతి స్తంభాలు...**

మేడారం జాతరలో ప్రధానమైన గద్దెలను పునర్నిర్మించారు. వృత్తాకారంలో ఉండే నలుగురు వనదేవతల గద్దెల చుట్టూ 25 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో 8 గ్రానైట్ రాతి స్తంభాలు ఏర్పాటు చేశారు. వీటి మధ్యలో... వెదురు బొంగుల రూపంలో ఉన్న వన దేవతలను ప్రతిష్ఠించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులతో పాటు... కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఉడుము, ఏనుగు, నెమలి, మొసలి, ఎద్దు, ఖడ్గమృగం, సింహం, మనుబోతు, నాగుపాము తదితర పశుపక్ష్యాదుల చిత్రాలను ఏర్పాటు చేశారు. కోయల జీవనశైలికి, ఆచార సాంప్రదాయాలకు, గొట్టుగోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక , బండి చక్రాలు, కంకవనం, అడ్డ, నిలువు గీతలకు గ్రానైట్ రాతి స్తంభాలపై చోటు దక్కింది. అలాగే, సమ్మక్క–సారలమ్మ వంశస్థులైన దాదాపు 250 కోయలఇంటి పేర్లు, వారి మూలాలను శిలలపై చెక్కడం ద్వారా ఈ గిరిజనుల చరిత్రను

తరువాయి 2లో..

# గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

*(మొదటి పేజీ తరువాయి)*

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్వొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామారెడ్డి, కళా రంగం నుంచి దీపికారెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌లకు పద్మ శ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సేవా, కళా, ఇతర రంగాల్లో వారు చూపిన అంకితభావం, సేవలతోనే ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపికయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ఓ పెద్ద జోక్ వేసింది

*(మొదటి పేజీ తరువాయి)*

బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని బండి సంజయ్ కుమార్ సెటైర్లు గుప్పించారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఛానల్‌ను బహిష్కరించడం కూడా వాళ్ల వంతేనా? అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు ఏం చేసినా తలూపడానికి తెలంగాణ ప్రజలు ఏం తెలియని వారని అను కుంటున్నారా.. అని ఫైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కర్రు కాల్చి వాత పెట్టినా సిగ్గు రాలేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కటంటే ఒక్క సీటు ఇవ్వకుండా చెంప చెళ్లుమనేలా తీర్పు నిచ్చిన సంగతి మరిచారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన పోటీ చేయ డానికి అభ్యర్థులు కూడా ముందుకు రాక ఎలక్షన్స్‌కు ముందే చేతులెత్తేసినా బుద్ధి మారదా? అని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన తప్పులను, అవినీతిని ఒప్పుకోకుండా టీవీ డిబేట్లలో, మీడియా సమావేశాల్లో శ్రుతి మించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించాలా? అని ధ్వజమెత్తారు.

**అందులో తప్పేముంది...**

అభ్యంతరకరంగా మీడియాను దూషించడం బీఆర్ఎస్ దృష్టిలో కరెక్టా..? అని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఆ పదాన్ని వెనక్కు తీసుకోవాలని పదేపదే కోరినా వినకుండా అడ్డగోలుగా మాట్లాడుతుంటే.. "గెట్ అవుట్ ఫ్రమ్ మై డిబేట్" అని ఏబీఎన్ ఛానల్ ప్రతినిధి అనడంలో తప్పేముంది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. నిజం మాట్లాడితే వ్యక్తిత్వ హననం చేస్తున్నారంటూ... కూని రాగాలు పాడటం బీఆర్ఎస్ నేతలకు అలవాటైందని విమర్శించారు. వ్యక్తిత్వమే లేని బీఆర్ఎస్ నేతలు 'వ్యక్తిత్వ హననం' గురించి మాట్లాడటం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలు చేయడంలోనే కాదని.. అభ్యంతరకరంగా మీడియాను తమ చేతల్లో ఉంచుకోవాలని అనుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆరితేరిపోయాయని దెప్పిపొడిచారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే సోయి కూడా లేకుండా మాట్లాడితే... రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని బండి సంజయ్ కుమార్ హెచ్చరించారు.

# మహేశ్‌గౌడ్ జాగృతి పార్టీలో చేరండి : పార్టీ అధ్యక్షురాలు కవిత

*(మొదటి పేజీ తరువాయి)*

కల వచ్చిందా..? అని ఎద్దేవా చేశా రు. ఆయన మానసిక పరిస్థితి చెక్ చేసుకోవాలని హితవు పలికారు. బలమైన రాజకీయ పార్టీగా జాగృతిని మార్చే ప్రయత్నం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు.

**సృజన్‌రెడ్డికి కాంట్రాక్ట్‌లు ఇప్పించిందే హరీశ్‌రావు...**

మాజీ మంత్రి హరీశ్‌రావు టార్గెట్‌గా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. 'సృజన్ రెడ్డికి కాంట్రాక్టులు ఇప్పించింది హరీశ్‌రావే. సృజన్‌రెడ్డి పెద్ద తిమింగలంగా మారటానికి ఆయనే కారణం. సృజన్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి బావమరిది అని హరీశ్ రావుకు అప్పుడు తెలియదా.? ఆయన తవ్విన గుంతలో మాజీ మంత్రి కేటీఆర్ పడటం బాధాకరం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాయనని హరీశ్‌రావు అనటం దళిత ఉప ముఖ్యమంత్రిని అవమానించటమే. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మాత్రమే లేఖ రాస్తానని హరీశ్‌రావు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడగకుండా రాష్ట్రానికి సీబీఐ ఎలా వస్తుంది..?. సీనియర్ అయిన హరీశ్‌రావుకు ఈవిషయం తెలియదా?. 2014 నుంచి జరిగిన సింగరేణి టెండర్లపై విచారణ జరపాలని ఆయన అంటున్నారు. అంటే కేసీఆర్ పాలనపైనా హరీశ్‌రావు విచారణ కోరుతున్నట్లే కదా?' అని కవిత ప్రశ్నించారు.

**హరీశ్‌రావు బాధ కమీషన్ల కోసమే..**

'హరీశ్‌రావు లేఖ రాయగానే కిషన్‌రెడ్డి మీటింగ్ పెడుతున్నారు. హరీశ్‌రావు బాధ అంతా ఆయన కమీషన్ల కోసమే. ఆయనకు చెందిన కంపెనీకి సింగరేణి టెండర్ ఎలా వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించటానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి. బీఆర్ఎస్ కాంట్రాక్టర్ల పక్షాన మాట్లాడటం బాధాకరం. జీతాలు ఇవ్వటానికి కూడా సింగరేణి వద్ద నిధులు లేవు. జాగృతి రెండేళ్లుగా సింగరేణి టెండర్‌లపై మాట్లాడుతుంటే భట్టి విక్రమార్క కనీసం స్పందించలేదు. సింగరేణికి చెందిన 25టెండర్లలో ఎక్కువ బీఆర్ఎస్ నేతలకు చెందిన కంపెనీలకే దక్కాయి. ఓబీ వర్క్స్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తీసుకురావడం కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు. సింగరేణి కార్మికుల కోసం జాగృతి పోరాటం చేస్తుంది' అని కవిత స్పష్టం చేశారు.

# నేడు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల నిరసన

*(మొదటి పేజీ తరువాయి)*

రాకపోతే ఫిబ్రవరి 3న మరోసారి దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

గిగ్ కార్మికులు తీవ్ర అనిశ్చితి, ఆదాయ భద్రతా లేమి, పారదర్శకతలేని రేటింగ్ వ్యవస్థలు, అకారణంగా ఐడీలు బ్లాక్ చేయడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని +ర్రూాఔఖ ఆరోపించింది. కార్మికులతో సంప్రదింపులు లేకుండానే కంపెనీలు పని విధానాల్లో మార్పులు చేస్తున్నాయని పేర్కొంది. ప్రత్యేకంగా మహిళా కార్మికులకు భద్రత, చట్టపరమైన రక్షణ, గౌరవం లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారని యూనియన్ జాతీయ అధ్యక్షురాలు సీమా సింగ్ తెలిపారు. న్యాయమైన వేతనం, పలు సందర్భాల్లో వినియోగదారుల నుంచి దాడులు ఎదురవుతున్నాయని, వాటిపై ఫిర్యాదు చేసినా ఏఐ ఆధారిత వ్యవస్థల వల్ల సకాలంలో స్పందన రావడం లేదని ఆమె పేర్కొన్నారు. ఫలితంగా మహిళా కార్మికుల ఐడీలు బ్లాక్ చేసి జీవనాధారాన్ని కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయని సీమా సింగ్ ఆరోపించారు.

ప్రస్తుతం గిగ్ కార్మికుల పరిస్థితులు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని యూనియన్ అభిప్రాయపడింది. ఒక ఈ-కామర్స్ సంస్థ ప్రతి నెలా 5 వేల మందికి పైగా కార్మికులను తొలగిస్తున్నామని చేసిన ప్రకటనను GIPSW యూనియన్ ఉదాహరణగా చూపింది. ఈ సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి, కార్మికశాఖకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా స్పందన లేదని గిగ్ యూనియన్ పేర్కొంది. 10 నిమిషాల డెలివరీ వ్యవస్థను నిలిపివేస్తామని గతంలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ హామీ ఇచ్చినప్పటికీ, నేటికి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు విడుదల కాలేదని పేర్కొంది. ఇది గిగ్ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదనడానికి సంకేతమని GIPSWU జాతీయ సమన్వయకర్త నిర్మల్ గోరానా విమర్శించారు.

# మేడారం వెళ్లొద్దాం!

*(మొదటి పేజీ తరువాయి)*

భావితరాలు తెలుసుకునే అవకాశం దక్కుతుంది.

**ఒంటికొమ్ము దుప్పి... సమ్మక్కకు ఇష్టదైవం...**

కోట్లాది మంది భక్తుల గుండెల్లో ఆరాధ్యదైవంగా నిలిచిన సమ్మక్క తన ఇంటి దైవంగా ఒంటికొమ్ము దుప్పిని కొలిచేవారు. చిలుకలగుట్ట వైపు నిర్మించిన ప్రధాన స్వాగత తోరణం మీద ఈ ఒంటికొమ్ము దుప్పి చిత్రాన్ని అగ్రభాగాన ఏర్పాటు చేశారు. ఒంటికొమ్ము దుప్పి పక్కనే అడవిదున్న కొమ్ములు, వాటిపై ఆరు నెమలీకలను చెక్కారు. కోయ తెగలో ముఖ్యమైన బేరంబోయిన రాజు (పశుపతి) ఆరో గొట్టు ప్రతిరూపంగా... ఇప్పటికీ గిరిజనులు నెమలీకలు ధరించి నృత్యం చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఇక 3వ గొట్టు సారలమ్మ, కాకా ఆమడరాజు వంశ వృక్షం. ఆదివాసీల్లో వివాహాలు గొట్టు, గోత్రం ఆధారంగానే జరుగుతాయి.

**గిరిజనులే పూజారులు**

మేడారం మహాజాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో జరుగుతుంది. ఈ జాతరలో పూజారులంతా గిరిజనులే. జాతరలో ప్రధానంగా సమ్మక్క, సారలమ్మలతో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులు ప్రధాన దేవతలు. ఈ నలుగురు ఆదివాసీ దేవతలకు వేర్వేరు ప్రదేశాల్లో గుడులున్నాయి. జాతర సందర్భంగా వీరంతా మేడారం గ్రామానికి చేరుకుంటారు. సమ్మక్క ప్రధాన ఆలయం మేడారం గ్రామంలోనే ఉంది. 1946కు పూర్వం సమ్మక్క ప్రధానం ఆలయం ఎస్ఎస్ తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఉండేది. ప్రతీ రెండేళ్ళకోసారి అక్కడ జాతర జరిగేది. మేడరాజుకు బయ్యక్కపేట సమీపంలోని అడవుల్లోనే సమ్మక్క దొరికిందని, ఆమె బయ్యక్కపేట వాస్తవ్యురాలేనంటూ ఆ గ్రామస్థులు నేటికీ ప్రగాఢంగా విశ్వసిస్తారు. కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు 12వ శతాబ్దంలో బయ్యక్కపేటలో జాతరను ప్రారంభించారు. నాటి నుంచి సమ్మక్క సారలమ్మ జాతర బయ్యక్కపేటలో కొనసాగింది.

**1946 నుంచి మేడారంలో...**

1944 తరువాత జాతరను నిర్వహించే చందా పరమయ్య, చందా భూపతయ్య, చందా జోగయ్య, చందా రామన్న మధ్య ఏర్పడిన విభేదాలతో... జాతరను బయ్యక్కపేటలో జరపడం నిలిపివేశారు. 1944 జనవరి 6న అప్పటి ములుగు తహసీల్దార్ బయ్యక్కపేట జాతర నిర్వాహణకు కమిటీ వేశారు. అయితే బయ్యక్కపేట జాతర నిర్వహించడానికి ఒప్పందం కుదరకపోవడంతో, మేడారానికి చెందిన సమ్మక్క పూజారులకు (వడ్డెలు) నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి సమ్మక్క పూజారులే జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. అలా 1946లో తొలిసారిగా మేడారంలో సమ్మక్క జాతర మొదలైంది. బయ్యక్కపేటకు చెందిన చందా వంశీయులు సమ్మక్కను తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. కాగా ప్రస్తుతం సిద్ధబోయిన, కొక్కెర వంశాలకు చెందినవారు సమ్మక్క ప్రధాన పూజారులుగా కొనసాగుతున్నారు. వీరంతా గిరిజనులే. సమ్మక్కకు సంబంధించిన ప్రధాన పూజలన్నీ ఆదివాసీ పద్ధతిలో నిర్వహిస్తారు. ఇక జాతరలో సమ్మక్కను చిలకలగుట్ట నుంచి గద్దెలపైకి తీసుకువచ్చే కీలకమైన బాధ్యతను సమ్మక్క వడ్డెగా ఉన్న కొక్కెర కృష్ణయ్య నిర్వర్తిస్తారు.

సారలమ్మ ప్రధాన ఆలయం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామంలో ఉంది. మేడారం-కన్నెపల్లి మధ్య మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాకా సారయ్య, సారలమ్మ ప్రధాన పూజారి. జాతర సందర్భంగా తొలిరోజు జరిగే వేడుకల్లో సారలమ్మ మేడారం ప్రయాణం ముఖ్యమైనది. హనుమంతుడి జెండా తోడు రాగా... సారలమ్మ మేడారం బయలుదేరుతుంది. మార్గమధ్యలో జంపన్నవాగు గుండా కాలినడకన నడుస్తూ ఆలయానికి చేరుకుంటారు. ఇక సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు ఆలయం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో ఉంది. పెనక బుచ్చిరాములు పగిడిద్దరాజు ప్రధాన పూజారి. పగిడిద్దరాజు తమ్ముడైన గోవిందరాజులు ఆలయం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో ఉంది. మేడారం-కొండాయి మధ్య పదిహేను కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇదంతా అటవీమార్గం. జాతర జరిగే మొదటి రోజు బుధవారం ఉదయం నుంచి కొండాయిలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం పడిగే రూపంలోని గోవిందరాజులుని తీసుకుని మేడారం బయలుదేరుతారు. నాలుగు గ్రామాల్లో ఉన్న ఈ నలుగురు వన దేవతలకు పూజారులంతా కూడా గిరిజనులే. పూజా విధానం కూడా ఆదివాసీ సంప్రదాయం ప్రకారమే జరుగుతుంది.

**బెల్లం బంగారమాయే..!**

సమ్మక్క జాతరలో బెల్లానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. జాతరలో బెల్లాన్ని 'బంగారం' అని పిలుస్తారు. ఇక్కడ ప్రసాదం కూడా బెల్లమే. అసలు బెల్లం ఎందుకు బంగారమయ్యింది? ఒకానొక సందర్భంలో మేడారం వైపు వచ్చిన కొందరు సంపన్నులు సమ్మక్కను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వారి కోర్కెలు నెరవేరడంతో మళ్లీ రెండేళ్ల తరువాత జాతరకు వచ్చి స్వర్ణాభరణాలు, విలువైన కానుకలు సమర్పించారట. దాన్ని చూసిన ఓ నిరుపేద భక్తుడు "మా ఇష్టదైవమైన నీకు ఏమీ సమర్పించుకోలేకపోతున్నాం. బతుకే బరువైన మేం అంత బంగారం ఎక్కిడి నుంచి తీసుకురావాలి? నీ అనుగ్రహం ఎలా పొందాలమ్మా' అంటూ సమ్మక్కను వేడుకొని కన్నీళ్లు పెట్టుకున్నాడట. సమ్మక్క ఆ భక్తుడికి కలలో కనిపించి 'బిడ్డా... నీ దగ్గరున్న బెల్లమిస్తే చాలు... బంగారం ఇచ్చినట్లే. బెల్లాన్ని నైవేద్యంగా పెడితే నీ కోర్కెలు తీరుస్తా' అని అమ్మవారు సెలవిచ్చారట. దాంతో ఆ పేదవాడు నిలువెత్తు బెల్లాన్ని తూకం వేసి తల్లికి సమర్పించుకుంటే అతడి కష్టాలు తీరినట్లు చెబుతారు. మేడారంలో సమ్మక్క, సారలక్కలకు బెల్లాన్ని నైవేద్యంగా సమర్పిస్తే, కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. గద్దెల వద్ద తల్లుల పాదాల చెంత పడే బెల్లానికి ఎంతో పవిత్రత ఉంటుందని నమ్ముతారు.

**తల్లులకు తీరొక్క మొక్కు..**

గద్దెలపై కంక మొదల్లతో దర్శనమిచ్చే ఈ వన దేవతలకు బంగారం సమర్పణతో పాటు ఒడి బియ్యం, శివసత్తుల పూనకాలు, ఎదురుకోళ్లు ఇలా ఎన్ని మొక్కులో. ప్రకృతి ఒడిలో ఉన్న ఆ తల్లులను స్మరించుకుంటూ మొక్కే ప్రతీ మొక్కుకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ మొక్కులలో ఒడి బియ్యం సమర్పణ ఒకటి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ ఇంటి నుంచే ఒడిలో బియ్యాన్ని తీసుకొస్తారు. నూతన వస్త్రంలో ఐదు సోరల బియ్యాన్ని పోసుకొని ముడుపుగా నడుముకు కట్టుకొని జాతరకు చేరుకుంటారు. ఈ బియ్యంలో పసుపు, కుంకుమతోపాటు రవిక ముక్కలు, కుడుకలు, చీరెలు కూడా ఉంచుతారు. సమ్మక్క సారలమ్మను తమ ఆడపడుచులుగా భావించి దర్శనం అనంతరం తల్లులకు ఈ బియ్యాన్ని మొక్కుగా చెల్లిస్తారు. ఈ మొక్కువల్ల తమ వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం బాగుంటుందని భక్తులు విశ్వసిస్తారు. మేడారానికి వచ్చే భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేయనిదే వెళ్లరు. కుంభమేళలో గంగానది వెంట ఇసుక వేస్తే రాలని జనం ఎలా ఉంటారో... జంపన్న వాగు వద్ద అదే పరిస్థితి కనబడుతుంది. అలాగే సంతానం లేని భక్తులు వచ్చే జారత నాటికి సంతానం కలగాలని వరం పడుతారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, వెదురు వనం, కొబ్బరికాయలతో పూజలు జరిపి ముడుపులు కడుతారు. అక్కడి నుంచి తడిబట్టలతో నేరుగా సారలమ్మ గుడికి చేరుకుంటారు. సారలమ్మను గద్దెకు తీసుకువచ్చే సమయంలో దారికి అడ్డంగా పడుకొని, సాష్టాంగ నమస్కారం చేస్తూ తమ కోర్కెను మనసులో తలుచుకుంటారు. సారలమ్మ తల్లి కన్నెపల్లి నుంచి మేడారంలోని గద్దెపైకి వెళ్లేటప్పుడు పూజారులు వీరి పైనుంచి దాటుకుంటూ వెళ్తారు. అలా చేస్తే ఆ తల్లి అనుగ్రహం లభిస్తుందని, తమకు సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. సమ్మక్క సారలమ్మ జాతరలో ఎదురుకోళ్ల మొక్కు ప్రధానమైనది. సమ్మక్క సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తున్న క్రమంలో భక్తులు ఎదురుకోళ్లతో స్వాగతం పలుకుతారు. తమ చేతిలో ఉన్న కోళ్లను తల్లులను తీసుకువస్తున్న సమయంలో ఎదురుగా ఎగరవేస్తూ మొక్కుకుంటారు. ఎగరేసిన కోడిని అనంతరం తల్లులకు బలిస్తారు. జాతరలో మేక పొట్టేలు, కోళ్లను బలివ్వడం ఆనవాయితీగా వస్తోంది. మరికొందరు భక్తులు తొట్టెలు కట్టి మొక్కు తీర్చుకుంటారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలో ఉన్న చెట్టు వద్ద తొట్టెలు (ఊయల) కట్టి మొక్కు చెల్లించుకుంటారు. జాతరలో మరో ప్రధానమైన మొక్కు తలనీలాలు. మేడారం జాతరకు ముందే చాలామంది వేములవాడకు వెళ్లి వస్తుంటారు. చిన్నపిల్లలకు వేములవాడలో తలనీలాలు ఇచ్చిన తర్వాత మేడారం జాతరలోనూ తలనీలాలు ఇవ్వడం సాంప్రదాయంగా వస్తోంది. జంపన్న వాగు వద్ద మూడు చోట్ల తలనీలాల కోసం కల్యాణ కట్టలను ఏర్పాటు చేశారు.

**ఆద్యంతం... ఉద్విగ్నభరితం...**

జాతరపై ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నా... అన్నింట్లోనూ కాకతీయులతో యుద్ధం అనంతరం సమ్మక్క చిలుకలగుట్టకు వెళ్లి అదృశ్యమైందని చెబుతుంటారు. కోయ గిరిజనులు తమ ఇలవేల్పు అయిన సమ్మక్క కోసం వెతుకుతూ చిలుకలగుట్టపైకి వెళ్లగా... ఆ గుట్టపై కుంకుమభరిణె రూపంలో సమ్మక్క కనిపించిందని చెబుతుంటారు. అదే నమ్మకంగా మహాజాతరకు చిలుకలగుట్ట నుంచే గిరిజన పూజారులు సమ్మక్కను గద్దెకు తీసుకువస్తుంటారు. సమ్మక్క ఆగమనం జాతరలో మహాఘట్టం అయితే... సమ్మక్కను చిలుకలగుట్టపైన ఎక్కడి నుంచి గద్దెలకు చేరుస్తారనేది రహస్యమే.

చిలుకలగుట్ట.. సమ్మక్క కొలువైన క్షేత్రం. మాఘశుద్ధ పౌర్ణమి గురువారం రోజున సమ్మక్కను గద్దెకు చేర్చేందుకు డప్పుచప్పుళ్లతో గిరిజన నృత్యాలు, పాటలతో చిలుకలగుట్ట వద్దకు చేరుకుంటారు. గుట్ట పాదాల దగ్గర ఉన్న వాగు వద్ద అందర్నీ నిలిపివేస్తారు. గుట్ట పైకి మాత్రం సమ్మక్క పూజారి కొక్కెర కిష్టయ్యతోపాటు మరో నలుగురు గిరిజన పూజారులు రహస్య ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ సమ్మక్క తల్లే కుంకుమభరిణె రూపంలో కొలువై ఉందని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలోనే సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది భక్తులు ఉద్విగ్నానికి గురవుతారు.

కలెక్టర్ పర్యవేక్షణలో ఎస్పీ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపి సమ్మక్కకు స్వాగతం పలుకుతారు. సమ్మక్కను గద్దెలపైకి తీసుకువచ్చే క్రమంలో లక్షలాది మంది భక్తులు ఎదురుకోళ్లు ఇవ్వడం, జంతు బలులు చేయడం, పొర్లుదండాలు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. శివసత్తుల పూనకాలతో మేడారం జాతర మొత్తం మహా ఉద్విగ్నంతో సమ్మక్కకు జేజేలతో స్వాగతం పలుకుతారు. జాతరలో అత్యంత ఉద్విగ్నభరిత మహాఘట్టమిదే. తల్లి గద్దెల మీదకు చేరుకున్న మరుక్షణం నుంచే భక్తులు మొక్కులు చెల్లిస్తూ చేసే జయజయధ్వానాలతో మేడారం హోరెత్తుతుంది. జన జాతర తారాస్థాయికి చేరుకుంటుంది. ఆ భక్తి హోరులో తడిసి ముద్దయినప్పుడే... జాతర దివ్యత్వం ఎవరికైనా అనుభవంలోకి వస్తుంది.



**1998లో రాష్ట్ర పండగగా గుర్తింపు...**

రెండేళ్లకు ఒకసారి నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరను 'తెలంగాణ కుంభమేళ' అని పిలుస్తారు. 1889లో అప్పటి నిజాం ప్రభుత్వం మత వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఓ శాఖను ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలోనే హిందు దేవాలయాలను పర్యవేక్షించడంతో పాటు మేడారం మహాజాతరను కూడా నిర్వహించేవారు. 1944 నుంచి ప్రభుత్వం జాతర కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేయడం ప్రారంభించింది. 1967లో మేడారం జాతరను దేవాదాయశాఖ తమ ఆధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మేడారం మహా జాతర జరుగుతూ వస్తోంది. కాగా, 1998లో మేడారం జాతరను రాష్ట్ర పండగగా గుర్తించారు. అప్పటి నుంచే జాతరకు భక్తులు పోటెత్తుతుండటంతో జాతీయ పండగగా గుర్తించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

# 100 స్పీడుతో ఎస్ఐని ఢీ కొట్టిన కారు

*(మొదటి పేజీ తరువాయి)*

అటువైపు వచ్చింది. ఎస్ఐ మధును ఢీకొట్టింది. మధు బానెట్‌పై పడగానే కారు అక్కడినుంచి దూసుకెళ్లిపోయింది. సుమారు 400 మీటర్ల వరకు ఎస్ఐని లాక్కెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. గాయాలపాలైన మధు ప్రస్తుతం మాల్ అనే గ్రామంలోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఈ దారుణానికి పాల్పడ్డ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తున్నారు.

**మరో ఘటనలో..**

కొద్దిరోజుల క్రితం ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను మాధవనగర్ వద్ద గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీకొట్టారు. దీంతో సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. సౌమ్యకు అండగా ఉంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. సౌమ్య వైద్య చికిత్స కోసం ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేసిందని వెల్లడించారు.

## సింగరేణి స్కాంలో

# రేవంత్‌రెడ్డినే లబ్ధిదారుడు: హరీశ్‌రావు

*(మొదటి పేజీ తరువాయి)*

విజిట్ సర్టిఫికెట్ కోసం కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన మీటింగ్ మినిట్స్ ఆఫ్ ద బుక్‌ను బయట పెట్టాలని కోరారు. మైనింగ్‌లో అనుభవం ఉన్న కాంట్రాక్టర్‌లను పక్కన పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ అధికారికంలోకి వచ్చాక సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు.

# బొల్లం తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి



**బొల్లం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**టిడిపి పట్టణ అధ్యక్షుడు జనపనేని కృష్ణ**

**కోదాడ (జనవరి 25 ) టుడే ప్రతినిధి:** మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షులు జనపనేని కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా మల్లయ్య యాదవ్ తన స్థాయిని మరిచి విమర్శించారని గతంలో ఏనాడు కూడా ఇటువంటి వ్యాఖ్యలను వినలేదన్నారు. రాజకీయ నాయకుడు అంటే విలువలతో కూడిన మాటలు మాట్లాడాలే కానీ వ్యక్తిగతంగా దూషణలు చేయడం సరికాదన్నారు. బొల్లం చేసిన వ్యాఖ్యలు తనకు ఎంతో బాధ కలిగించాయన్నారు. తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమూరి నాగేశ్వరరావు, పుల్లూరి శ్రీనివాసరావు, వేమూరి సురేష్, మీసాల భగత్, ఏర్పుల పాపారావు, పాషా, బ్రహ్మయ్య, అమర గాని కృష్ణ, గూడేపు చిరంజీవి, లింగయ్య, రాజేష్, సోమయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తులో ప్రయాణం మృత్యువుకు మార్గం

**కోదాడలో రోడ్డు భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన**




**కోదాడ (జనవరి 25) టుడే ప్రతినిధి :** మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసో త్సవాల సందర్భంగా కోదాడ పట్టణంలో రద్దీగా ఉండే పలు కూడళ్లలో ఆయన ప్రజలకు మైకు తో అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## బొల్లం దిష్టిబొమ్మ దగ్ధం

# గుడిబండలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**హద్దు మీరితే సహించం : తూమాటి నాగిరెడ్డి హెచ్చరిక**



**కోదాడ రూరల్ ( జనవరి 25) టుడే ప్రతినిధి:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గుడిబండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. సీనియర్ నాయకులు తూమాటి నాగిరెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కోదాడ మేళ్లచెరువు రహదారిపై బొల్లం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదని, సభ్య సమాజం తలదించుకునేలా బొల్లం మాట్లాడటం విచారకరమన్నారు. తక్షణమే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించే దమ్ము లేకనే బొల్లం ఇటువంటి నీచమైన రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యక్తిత్వాన్ని విమర్శించే స్థాయి బొల్లంకు లేదని ఎద్దేవా చేశారు. మరలా ఇటువంటివి పునరావృతం అయితే ఖబర్దార్ అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి,కుక్కడపు నాగరాజు గౌడ్, పులి వెంకటేశ్వర్లు, వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి, నరోత్తం రెడ్డి, నర్సిరెడ్డి, సిద్దయ్య, రాములు, వీరారెడ్డి, అఖిల్, పవన్, కుమార్ హేమంత్ అసన్ హాలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



- కర్ల రాజేష్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ ఉంది

# ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పని చేస్తుంది

- రాజకీయ లబ్ధి కోసమే ఉత్తమ్ దంపతులపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ బే షరతుగా క్షమాపణ చెప్పాలి
- ఎస్.టి ప్రభుత్వ ఉద్యోగి పై "నా బూట్లు నాకుతావు" అంటూ అనుచిత వ్యాఖ్యలు
- బొల్లం మల్లయ్య పై ఎస్సీ, ఎస్టీ, రాష్ట్ర, జాతీయ కమిషన్ సుమోటాగా కేసు నమోదు చేయాలి
- ఉత్తమ్ దంపతులపై అసత్య, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బొల్లంపై పరువు నష్టం దావా
- సామాజిక బాధ్యతను విస్మరించిన బొల్లం
- టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి



**కోదాడ (జనవరి 25)౦టుడే ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తుందని, రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఉత్తమ్ దంపతులపై అసత్య ప్రచారం, అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, దళిత బిడ్డ మృతిపై శవరాజకీయం చేస్తున్నాడని, బేషరతుగా క్షమాపణ చెప్పి, వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... కర్ల రాజేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి ప్రభుత్వం నుండి రావలసిన అన్ని రకాల సహాయం అందించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చునున్నట్లు తెలిపారు. కాగా కోదాడ నియోజకవర్గంలో గత ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతి అక్రమాలకు నిలయంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం పై ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా బుద్ధి చెప్పారని, హద్దులు దాటి తన రాజకీయాల అబ్ధి కోసం శవరాజకీయాలు చేస్తున్నారని ఘాటుగా స్పందించారు. చలో కోదాడ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఎస్టి ఉద్యోగి నీ ఉద్దేశిస్తూ నీవు నా బూట్లు నాకావు..అంటూ ఆ ఉద్యోగపై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్, జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. కోదాడ నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు, షాడో ఎమ్మెల్యే పనితీరులపై ప్రజలు తీవ్రంగా స్పందించి నలమాద పద్మావతి రెడ్డి ని 60 వేల మెజారిటీతో ఎమ్మెల్యేగా ఎన్నుకొని ప్రజలు నిరసన తెలిపారని గుర్తు చేశారు.

హుజూర్నగర్ కోదాడ నియోజకవర్గాలకు వేలాది కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తుంటే అభివృద్ధిని చూడలేక, కాంగ్రెస్ పార్టీపై, ఉత్తం దంపతులపై అసత్య ప్రచారం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేసున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీలో ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త దీటుగా పనిచేస్తూ నిరంతరం ప్రజలతో అనుసంధానంగా ఉంటారని అది చూసి ఓర్వలేక షాడో ఎమ్మెల్యేలంటూ తన ఉనికి కాపాడుకోవడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, ఎర్నేని బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు సుందరి వెంకటేశ్వర్లు, బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ నాయకులు గంధం యాదగిరి, నెమ్మాది దేవమని ప్రకాష్ బాబు,బిసి నాయకులు ఈదుల కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ సామినేని నరేష్, గుండపనేని నాగేశ్వరరావు,శివసుబ్బరావు డాక్టర్ బ్రహ్మం, నాయకులు చింతలపాటి శ్రీనివాసరావు, పిల్లుట్ల శ్రీనివాసరావు, పత్తిపాక కృష్ణ, జనార్ధన్, చావల్, భాయుజాన్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే మల్ల యాదవ్ నీచ రాజకీయం..



రాజకీయ లబ్ధి కోసమే మల్ల యాదవ్ నీచ రాజకీయం చేస్తున్నారు. తన పార్టీలో ఇన్చార్జి పదవి దక్కించుకోవడానికి నీతిమాలిన రాజకీయం చేస్తున్నాడు. కర్ల రాజేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంది. ప్రభుత్వ ఆమె మేరకు సహాయం అందుతుంది. ఉత్తం పద్మావతి దంపతులపై అసత్య ప్రచారం అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కోదాడ నియోజకవర్గ ప్రజలు గడచిన ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పిన తన తీరు మారలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా పాలన కొనసాగిస్తుందని, రాజకీయ లబ్ధి కోసం కుటిల రాజకీయాలు చేసే వారిని ప్రజలు ప్రోత్సహించొద్దని పిలుపునిచ్చారు. ఉత్తం దంపతులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**- సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు**

## అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారం మానుకోవాలి.. బే షరతుగా క్షమాపణ చెప్పాలి



ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం కు ప్రజా సమస్యల పట్ల సూచనలు సలహాలు ఇస్తూ... నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలే కానీ, పద్మావతి రెడ్డిని మహిళగా గౌరవించకుండా వ్యక్తిగతంగా దూషించడం క్షమించరాని చర్యగా భావిస్తూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ బహిరంగంగా మహిళలకు క్షమాపణ తెలపాలని డిమాండ్ చేస్తున్నాను. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లు చేస్తున్న అభివృద్ధి ని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. గత పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై పత్రికల్లో ఎన్నో కథనాలు వచ్చాయని, వాటిని ప్రజలు విశ్వసించి గత అసెంబ్లీ ఎన్నికల్లో 60 వేల మెజార్టీతో పద్మావతి రెడ్డి గారికి విజయం చేకూర్చారన్నారు. కర్ల రాజేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, మల్లయ్య యాదవ్ రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య వైషమ్యాలు కలిగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు. బేషరతుగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలి..

**- మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు**

## అభివృద్ధి ప్రదాతల పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం



హుజూర్నగర్ కోదాడ నియోజకవర్గాలను వేలాది కోట్ల రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్తం దంపతులపై అసత్య ప్రచారం అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కర్ల రాజేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. రాజకీయ లబ్ధి కోసమే చలో కోదాడ కార్యక్రమం. బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం మైనార్టీల మధ్య అసమాన తలపించి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం మాజీ ఎమ్మెల్యే బొల్లంకు తగదు. భేషరతుగా క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో పోటీ పడాలి కానీ నీచ రాజకీయాలతో ప్రశాంతంగా ఉన్న కోదాడను రాజకీయ లబ్ది కోసం రణరంగంగా మార్చవద్దు. పట్టణ సీఐపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎస్సీ ఎస్టీ కమిషన్ సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలి. బే షరతుగా క్షమాపణ చెప్పాలి.

**- మాజీ సర్పంచ్ పారా సీతయ్య**

## వ్యక్తిగత దూషణలకు దిగటం అహంకారానికి నిదర్శనం..



రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలు దిగటం అహంకారానికి నిదర్శనం. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి ల పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బే షరతుగా క్షమాపణ చెప్పాలి. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలు ఇంకా ప్రజలకు గుర్తున్నాయి. చిల్లర రాజకీయాలకు స్వస్తి చెప్పకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారు. పట్టణ సీఐపై మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ ఉద్యోగులను గౌరవప్రదంగా చూడడం రాజకీయ నాయకుల బాధ్యత అని, బాధ్యతలను విస్మరించి అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల చర్యలు తీసుకోవాలి. మాజీ ప్రజాప్రతినిధులు యువతకు మార్గదర్శకులుగా ఉండాలి కానీ, యువతని పెడదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. మాజీ ఎమ్మెల్యే బే షరతుగా క్షమాపణ చెప్పాలి.

**- మాజీ సీఎం సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు**

## చౌకబారు విమర్శలు.. యువతపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయి



ఉత్తమ్ దంపతులపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు కారింగుల అంజన్ గౌడ్ పేర్కొన్నారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం సేవలందించిన కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పై వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలు రాజకీయాలలో సరికావున్నారు. అభివృద్ధి తమ శ్వాసగా, కోట్ల రూపాయల నిధులతో ఉత్తమ్ పద్మావతి రెడ్డి దంపతులు కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నారని అటువంటి వ్యక్తులపై చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇటువంటి మాటలు రాజకీయాలలోకి రావాలనుకుంటున్న యువతపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయి అన్నారు. బహిరంగ సభలో మాట్లాడేటప్పుడు నియంత్రణతో మాట్లాడాలని హితవు పలికారు. తక్షణమే మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

**- జిల్లా ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు కారింగుల అంజన్ గౌడ్**

## కోదాడ సీఐపై నోరు జార్చిన బొల్లం మల్లయ్య యాదవ్

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ నిరసన డీఎస్పీకి వినతిపత్రం
- రంగా థియేటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం
- కారును అడ్డగించిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు





కోదాడ పట్టణ సీఐ శివశంకర్‌పై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసి గిరిజన, ఎస్సీ, ఎస్టీ వర్గాల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోదాడ పట్టణంలో నిరసన చేపట్టారు. ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన యువత నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పట్టణంలోని రంగా థియేటర్ సమీపంలో బొల్లం మల్లయ్య యాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మండిపడ్డారు. ప్రజల రక్షణ కోసం పనిచేసే పోలీస్ అధికారిపై, పైగా ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి మాటలు మాట్లాడే వ్యక్తులు ప్రజా జీవితంలో ఉండే అర్హత కోల్పోయారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.రాజకీయ హోదా ఉందని చట్టాన్ని తుంగలో తొక్కడం సహించబోమని స్పష్టం చేశారు. బొల్లం మల్లయ్య యాదవ్‌పై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని హెచ్చరించారు. గిరిజనుల ఆత్మగౌరవంపై దాడి చేసిన ప్రతి ఒక్కరికి చట్టం గట్టి గుణపాఠం చెప్పాల్సిందేనని, పోలీస్ శాఖకు అండగా నిలుస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో గిరిజన నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో కోదాడ పట్టణాన్ని హోరెత్తించారు.

## వ్యక్తిగత దూషణలు రాజకీయాల్లో సరికాదు



రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని వ్యక్తిగతంగా దూషించిన మాజీ ఎమ్మెల్యే పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. అసత్య ప్రచారాలు అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే తగిన బుద్ధి చెబుదాం. కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్న వ్యక్తులపై చౌపారు విమర్శలు చేయడం శోచనీయం. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

**- పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుందరి వెంకటేశ్వర్లు**

# కేసు నమోదు చేయాలని డీఎస్పీకి పిటీషన్



**కోదాడ (జనవరి 25) టుడే ప్రతినిధి :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పద్మావతి రెడ్డీ లను అనుచిత వ్యాఖ్యలు చేసి, దూషించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం డీఎస్పీకి శ్రీనివాస్ రెడ్డి కి పిర్యాదు అందజేసారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల పై ఇష్ట మైన రీతి లో మాట్లాడి, వారి స్థాయిని కించ పరచడమే కాకుండా, నియోజకవర్గ ప్రజల మనోభావాలు దెబ్బ తీసేవిధంగా ఉన్నాయని పిటిషన్ లో వెల్లడించారు. శాంతి యుతంగా ఉన్న కోదాడ లో ఒక మాజీ ప్రజా ప్రతినిధి అయి ఉండి అలజడులు సృష్టించే విధంగా ఉన్న ఆయన తీరుపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

గతంలో కూడా పలుసార్లు ఇటువంటి వ్యాఖ్యలు చేశారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల శ్రీనివాసు రావెళ్ల కృష్ణారావు ఎండి కాజా భాయ్ తిపిరి శెట్టి రాజు వేమూరి విద్యాసాగర్ నెమ్మాది దేవమణి ప్రకాష్ బాబు తిప్పని. శ్రీనివాస్ చామర్తి బ్రహ్మం ముస్తఫా వంగవీటి శ్రీనివాసరావు ఏసు పాదం మల్లు నాగిరెడ్డి మల్లు వెంకట్ రెడ్డి బోలి శెట్టి రాము కుర్రి గోపయ్య ఎస్కే పాషా షేక్ ఇక్బాల్ సిరం శెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### ఉద్యమకారిణి ప్రొఫెసర్ అక్కమ్మ

# సేవలు చిరస్మరణీయం : చింతాబాబు మాదిగ

**కోదాడ జనవరి 25 టుడే ప్రతినిధి:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, సకల జనుల సమ్మెలో తనవంతు పాత్ర పోషించిన ప్రొఫెసర్ అక్కమ్మ మృతి తీరని లోటని ఎంఆర్పీఎస్ దక్షిణ తెలంగాణ జిల్లాల అధ్యక్షులు చింతాబాబు మాదిగ అన్నారు. ఆదివారం కోదాడ 19వ వార్డులో ఆమె దశదిన ఖర్మ సందర్భంగా నివాళులర్పించిన ఆయన, ఆమె ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దారని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమె చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల శ్రీను, దర్గయ్య, జిల్లా యువసేన అధ్యక్షులు బచ్చలకూరి నాగరాజు మాదిగ, కాజా,ఉపాధ్యక్షులు కందుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# ఐక్యతతోనే పెరిక కులస్తుల అభివృద్ధి

### రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



**కోదాడ (జనవరి 25) టుడే ప్రతినిధి:** పెరిక కులస్తులంతా ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడలోని పెరిక హాస్టల్‌లో జిల్లా అధ్యక్షులు సముద్రాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, సూర్యాపేట జిల్లా పెరిక సంఘం పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని 90 గ్రామాల నుంచి 360 మందితో కూడిన భారీ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో పెరిక ఆత్మగౌరవ భవన నిర్మాణం మన ప్రధాన లక్ష్యమని, దీనికోసం ప్రతి కులస్తుడు కృషి చేయాలని కోరారు. కులంలో పేద, ధనిక భేదాలు ఉండకూడదని, సామాన్యులకు కూడా సముచిత స్థానం కల్పించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. నూతన కమిటీ సభ్యులు కుల బాంధవులకు అండగా ఉంటూ ఐక్యతను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఖైరతాబాద్ పెరిక హాస్టల్ మాజీ అధ్యక్షులు అంగిరేకుల నాగార్జున,కిత భద్రయ్య ,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తిపాక జనార్దన్, యూత్ అధ్యక్ష కార్యదర్శులు బుడిగం కిరణ్ కుమార్, పిన్నిని సందీప్, సూర్యాపేట పట్టణ పెరిక సంఘం అధ్యక్షుడు పత్తిపాక వేణుధర్ లతో పాటు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పెరిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కుల ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


PRINTED AND PUBLISHED BY BADE RAMARAO, ONBEHALF OF HANSINI PUBLICATION PVT LTD, PRINTED AT HANSINI PRINTERS PVT LTD, H.NO.3-119/A,CHUERVUKALVERTU PRAKKABAZARNUNDI, ANANTHAGIRI ROAD, KODAD, DIST-NALGONDA-508206.
EDITOR: BADE RAMARAO. CELL: 9948132341. RNI NO:125624/2013 E-MAIL: HANSINITODAY@GMAIL.COM, www.todaytelugudaily.com